క్లుప్తంగా

చిత్తూరు తాలూక సీఐగా గంగిరెడ్డి



చిత్తూరు అర్బన్: చిత్తూరు తూర్పు (తాలూక) సీఐగా ఎం.గంగిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పుంగనూరు అర్బన్ సీఐగా పనిచేస్తున్న గంగిరెడ్డిని చిత్తూరు తాలూకకు, ఇక్కడ పనిచేస్తున్న మద్దయ్య ఆచారిని చిత్తూరు టూ టౌన్‌కు బదిలీ చేస్తూ ఇటీవల ఉత్తర్వులు వెలువడిన విషయం తెలిసిందే. కాగా శాంతిభద్రతల పర్యవేక్షణలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకు వెళ్లనున్నట్లు గంగిరెడ్డి తెలిపారు.

ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలి

ఐరాల: మండలంలోని రైతులు రబీలో తాము సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ వరలక్ష్మి సూచించారు. బుధవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట బీమా వర్తించాలన్నా, ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై పొందాలన్నా ఈ–క్రాప్ తప్పనిసరి అని పేర్కొన్నారు.

సేవా దృక్పథంతో పనిచేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ బెన్నురాజ్

బంగారుపాళెం: సేవా దృక్పథంతో పనిచేసినప్పుడే స్వచ్ఛంద సంస్థలకు గుర్తింపు వస్తుందని తహసీల్దార్ బెన్నురాజ్ అన్నారు. బుధవారం స్థానిక గ్రేడ్స్ సంస్థ ఆధ్వర్యంలో 25 మంది వికలాంగులకు ఉచితంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో స్వచ్ఛంద సంస్థలు స్వార్థచింతనతో కాకుండా సేవా గుణంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, సీఐ నరసింహారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్‌అహ్మద్, ఈఓ శంకరయ్య, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, సంస్థ నిర్వాహకుడు శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై ప్యాకింగ్ షెడ్లు

ఐరాల: మండలంలో మామిడి, ఇతర పండ్ల తోటల్లో ప్యాకింగ్, గ్రేడింగ్ కోసం షెడ్డు నిర్మించుకోవడానికి ప్రభుత్వం 50 శాతం (రూ.2 లక్షల వరకు) రాయితీ అందిస్తుందని బుధవారం ఉద్యానశాఖ అధికారి సాగరిక తెలిపారు. 30 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో రెండు తలుపులు, ఎనిమిది కిటికీలు, రేకులతో ప్యాకింగ్ షెడ్డు నిర్మించాలన్నారు. ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారుపాసు పుస్తకం, ఆధార్ జిరాక్సు, బ్యాంకు ఖాతా మొదటి పేజీ జిరాక్సులను ఉద్యానశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు 7995086960లో సంప్రదించాలని కోరారు.

నేడు వాహనాల వేలం

పలమనేరు: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను గురువారం ఉదయం 10 గంటలకు సెబ్ పోలీస్ స్టేషన్ వద్ద వేలం వేయనున్నట్లు ఎస్ఐ ఎల్లయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తిగలవారు నిర్దేశిత డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

సంఘమిత్రలకు ముగిసిన శిక్షణ

గంగవరం: స్థానిక వెలుగు సమాఖ్య భవనంలో వారం రోజులుగా ఆర్థిక అక్షరాస్యతపై సంఘమిత్రలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. డీఆర్‌డీఏ పీడీ తులసి, శ్రీనివాసన్ మాట్లాడుతూ శిక్షణలో తెలుసుకున్న అంశాలను గ్రామాల్లోని గ్రూపు సభ్యులకు వివరించాలని సూచించారు. అనంతరం ఒక్కో సంఘమిత్రకు రూ. 3 వేల విలువైన ట్రెనింగ్ కిట్లు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏరియా కో–ఆర్డినేటర్ హరినాథ్, ఏపీఎం నాగవేణి, ఇండియన్ బ్యాంకు మేనేజర్ అశోక్‌కుమార్, ట్రెనింగ్ కో–ఆర్డినేటర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కోనేటిరాయుని హుండీ లెక్కింపు

గంగవరం: కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు చేపట్టారు. నాలుగు నెలలకు గాను మొత్తం రూ.10.88 లక్షల కానుకలను స్వామివారికి భక్తులు సమర్పించినట్లు ఏఈఓ గురుమూర్తి తెలిపారు. ఆలయ సూపరింటెండెంట్ ముని చెంగల్రాయులు పాల్గొన్నారు.

పీఈఎస్ విద్యార్థుల ప్రతిభ



రుబీణి, సఫియా ఖాన్, మొగల్‌ఫాతిమా

గుడుపల్లె: వైఎస్సార్ హెల్త్ వర్సిటీ బుధవారం విడుదల చేసిన ఫిజియోథెరపీ ఫైనలియర్ పరీక్ష ఫలితాల్లో కుప్పం పీఈఎస్ విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపల్ హెచ్‌ఆర్ కృష్ణారావు తెలిపారు. 74శాతం మార్కులతో సఫియా ఖాన్, 70శాతం మార్కులతో మొఘల్ ఫాతిమా, రుబీణి ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు.

పార్టీలకతీతంగా పథకాలు

- ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



తెల్లరాళ్ల పంచాయతీలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి: పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లె సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సచివాలయ పరిధిలో ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా.. సచివాలయ అధికారులు, వలంటీర్లు మీ ఇంటికి వస్తున్నారా? లేదా అని అడిగితెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నకు ఓటు వేసి, మరోసారి ముఖ్యమంత్రి చేయాలని కోరారు. తెల్లరాళ్లపల్లె సచివాలయ పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్లు వేయాలని కోరారు. ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు మనోహర్ రెడ్డి, మనోహరన్ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌బాబూ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుడిపాల: ‘లోకేష్‌బాబు ఎవరో పేపర్‌లో రాసిస్తే మాట్లాడేది కాదు.. నిజాలు తెలుసుకుని మాట్లాడు.. తెలుగులో మాట్లాడమే సరిగ్గా రాని నీవు మా నాయకుడి గురించి మాట్లాడతావా.. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడు..’ అని వైఎస్సార్‌సీపీ గుడిపాల మండల నాయకులు అన్నారు. గుడిపాల మండలంలో బుధవారం ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గుడిపాల మండలంలోని నారగల్లులో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 200 ఎకరాల భూమిని కబ్జా చేశాడన్నారు. ఎక్కడ చేశారో చూపించాలని సవాల్ విసిరారు. నాయకులు రజినీకాంత్, శిలంబరసన్, రవి, సాయి, సామ్‌వేల్ మాట్లాడుతూ గుడిపాల మండలంలో నారగల్లు సర్వే నంబర్ 344లో మేతబీడు పొరంబోకు పేరిట 1992 ఎకరాలు ఉన్నాయని ఇప్పటికి కూడా ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగానే ఉందన్నారు. లేనిపోని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని, ఎక్కడ చేశాడో నిరూపించగలవా? లేకపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటావా? అని వారు సవాల్ విసిరారు. లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకొనేది లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రవీంద్రారెడ్డి, సంపత్, శివకుమార్, యోవాన్, కృష్ణన్, ధీన, రజిని పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రియాంక

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని వైద్య సేవలు పొందాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. బుధవారం మండలంలోని మల్లకుంటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ ప్రియంక 97 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గర్భిణులు, చిన్న పిల్లలు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించాలనే సంకల్పంతో ఫ్యామిలీ ఫిజిషియన్(డాక్టర్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు ప్రతి నెల పరీక్షలు చేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఐరాల విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో సత్తాచాటిన విద్యార్థులతో ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి

ఐరాల: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్–14 బాలికల విభాగం పోటీల్లో జిల్లా జట్టు తరుపున పాల్గొన్న ఐరాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారనిఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు, పెద్దవేగి క్రీడామైదానంలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్–14 బాలికల విభాగం పోటీల్లో జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచి, కాంస్య పతకం సాధించిందని ఆయన తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులు దివ్యశ్రీ, యువశ్రీ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి సత్తా చాటారని చెప్పారు. అలాగే ఇటీవల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–14 బేస్‌బాల్ బాలికల విభాగంలో జిల్లా జట్టు రెండో స్థానం సాధించి, రజిత పతకం కైవసం చేసుకుందని, ఈ పోటీలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు రూప, వర్షిణి, యువశ్రీ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఈ సందర్భంగా ఐల గురివిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గోపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, క్రీడాకారులను అభినందించి, జ్ఞాపికల అందజేసి, సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విజయలక్ష్మి, పీఎంసీ చైర్మన్ రవీంద్రరెడ్డి, పీడీలు దేవా,శివ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకానికి ప్రాధాన్యత ఇవ్వాలి

పాలసముద్రం: మండల రైతులు సేంద్రియ ఎరువుల వాడకానికి ప్రాధాన్యత ఇవ్వాలని చిత్తూరు ఏపీపీఎస్ఎఫ్ డీపీఎం వాసు కోరారు. బుధవారం శ్రీకావేరి రాజుపురం రైతు భరోసా కేంద్రంలో సచివాలయ సిబ్బంది, రైతులకు సర్పంచ్ గాలి మహేష్ బాబు అధ్యక్షతన సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి ఆయన మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయ విధానంలో సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులతోపాటు నికర ఆదాయం పొందవచ్చన్నారు. రసాయన ఎరువుల వాడకం పట్ల ఆహారోత్పతులు విషతుల్యమవుతున్నాయని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

శ్రీరంగరాజపురం: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి వాసు అన్నారు. బుధవారం మండలంలోని మంగుంట గ్రామానికి చెందిన రైతు శేషాద్రి ప్రకృతి వ్యవ సాయ విధానాలతో సాగు చేసిన చెరుకు నుంచి తయారు చేస్తున్న బెల్లాన్ని ఆయన పరిశీలించారు.

పేదల పాలిట వరం ఫ్యామిలీ డాక్టర్



వైద్య పరీక్షలు చేస్తున్న ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదల పాలిట వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఐలవారిపల్లె సచివాలయ పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 70 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే గర్భిణులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్య సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఉమాపతి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికర భోజనం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సర్కారు రుచికరమైన భోజనం అందిస్తుందని ఎంపీడీఓ గౌరి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా మెను ప్రకారం రుచికరమైన భోజనాన్ని పాఠశాల సిబ్బంది ఆధ్వర్యంలో అందుతుందా? లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమ్మేపల్లెలోని జగనన్న లేఅవుట్‌లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ఉగాది రోజు అందరు గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఇంకా పూర్తి కాని ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. దగ్గరుండి పనులు పూర్తి చేయించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు.

రేపు మదనపల్లెలో జాబ్‌మేళా

పుంగనూరు: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మదనపల్లె బీటీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఎంపీ మిథున్‌రెడ్డి వివిధ కంపెనీలతో మాట్లాడి మేళా ఏర్పాటు చేస్తున్నారన్నారు. పదోతరగతి చదివిన వారు కూడా జాబ్‌మేళాకు హాజరుకావచ్చని సూచించారు. పుంగనూరు, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అడవుల సంరక్షణ సామాజిక బాధ్యత



గౌరీశంకరపురంలో అడవుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

బంగారుపాళెం: అడవులు, వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యతని పలమనేరు అటవీశాఖ రేంజ్ అధికారి నయిమ్‌అలీ అన్నారు. మండలంలోని గౌరీశంకరపురం, టేకుమంద గ్రామాల్లో అడవుల సంరక్షణపై బుధవారం సాయంత్రం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల్లో అనేక రకాల వృక్షాలు, జంతువులు నివాసం ఉంటాయన్నారు. నిప్పుపెట్టడంతో వన్యప్రాణులు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. చెట్లు కాలిపోవడంతో మానవ మనుగడకు ప్రమాదమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అడవుల్లో చెట్లు సమృద్ధిగా ఉంటే సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. స్వచ్ఛమైన వాతారణం చెట్ల వల్లే వస్తుందన్నారు. అడవుల్లో చెట్లు నరకడం, వన్యప్రాణులను వేటాడడం నిషేధమన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించేవారిపై చరట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతే కాకుండా పలమనేరు రేంజ్ పరిధిలోని కొదలమడుగు, టేకుమంద, కీరమంద, మొగిలి, మొగిలివారిపల్లె పంచాయతీల పరిధిలోని అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయన్నారు. వాటికి ఎటువంటి ప్రాణహాని కలిగించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ రమేష్, అధికారులు శ్రీనివాసులు, ప్రేమలత, హైమావతి, షణ్ముగం పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి



మాట్లాడుతున్న ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి

ఐరాల: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని పొలకల జెడ్పీ హైస్కూల్, జి.ఎర్రేపల్లె, కుమ్మరపల్లె, ఎల్లంపల్లె ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఆయన పాఠశాలలకు సంబంధించిన రికార్డులు, మరుగుదొడ్లు, జగనన్న గోరు ముద్ద పథకం, ఎఫ్ఏ–3 పరీక్షల అమలును పరిశీలించారు. అనంతరం పొలకల జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వద్దని, సమయానికి పాఠశాలకు హాజరు కావాలని తెలిపారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందేలా చేసి, ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా చూడాలన్నారు. ఉపాధ్యాయుల బోధనోపకరణాల్లో లెసన్ ప్లాన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మనబడి నాడు–నేడు పనులు కూడా త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు.

బఫూన్‌లా లోకేష్ ప్రవర్తన

- బుల్లెట్‌సురేష్

చిత్తూరు కార్పొరేషన్: నారా లోకేష్ ప్రవర్తన బఫూన్‌లా ఉందని ఏపీ మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు పాలనతో విసిగిపోవడంతోనే ప్రజలు యువగళం యాత్రకు రావడం లేదన్నారు. మంత్రి పెద్దిరెడ్డి, సీఎం జగనన్న విమర్శించే స్థాయి వారికి లేదన్నారు. మంగళగిరిలో ఎమ్మెల్యేగా ఓడిపోయిన లోకేష్ టీడీపీని తిరిగి అధికారంలోకి తేవడం కలన్నారు. ఎంతసేపు ప్రజాప్రతినిధులను విమర్శించడం తప్ప భవిష్యతు కార్యచరణ, హామీలను ఎందుకు ప్రకటించడం లేదన్నారు. మ్యానిఫెస్టోను భగవద్గీతగా భావించి బడుగు, బలహీనవర్గాలకు పెద్దపీట వేస్తున్న జగనన్నకు లోకేష్ వెంట్రుకతో సమానమన్నారు. చంద్రబాబు సొంత జిల్లాలో టీడీపీ ఓటమికి కారణమైన పెద్దిరెడ్డిని చూసి టీడీపీ క్యాడర్ ఓర్వలేకపోతున్నదన్నారు. యువగళం ఎందుకు ప్రారంభించామా? అని చంద్రబాబు, లోకేష్‌కు దిక్కుతోచక పిచ్చిపట్టినట్లు వ్యవహరించడం సరికాదన్నారు.

ప్రతి మహిళా ఓ శక్తిగా ఎదగాలి



మహిళలకు టైలరింగ్ కిట్లను అందజేస్తున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ తులసి

చిత్తూరు అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ప్రతి మహిళ ఓ శక్తిగా ఎదిగి ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ తులసి అన్నారు. బుధవారం స్థానిక టీటీడీసీ కేంద్రంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, స్నేహ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళలకు టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రాథమికంగా పట్టణ ప్రాంతాల్లో మహిళలకు ఉచితంగా నెలరోజుల పాటు టైలరింగ్ శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టమన్నారు. త్వరలోనే గ్రామీణ ప్రాంత మహిళలకు కూడా టైలరింగ్ శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలియజేశారు. అనంతరం ఆమె శిక్షణకు వచ్చిన మహిళలకు శిక్షణ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాబ్స్ జేడీఎం సరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

- జిల్లా వ్యవసాయశాఖాధికారి హబీబ్‌బాషా



అన్నూరు వద్ద మామిడిలో అంతర్ పంట సాగును పరిశీలిస్తున్న హబీబ్‌బాషా

కార్వేటినగరం: రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలకు ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి హబీబ్‌బాషా అన్నారు. బుధవారం మండలంలోని రైతులు రబీలో సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేసుకున్న వారి వివరాలను తనిఖీ చేశారు. అలాగే పలువురు రైతులు సాగు చేసి వేరుశనగ, మినుము, అలసంద, మామిడి పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే అన్నూరు, గోపిశెట్టిపల్లె, ఆళత్తూరు ఆర్బీకేలను సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయశాఖాధికారి మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటలకు విధిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని చెప్పారు. పంట నమోదు చేసుకోవడంతో పంటల బీమా, సున్నావడ్డీ తదితర పథకాలకు అర్హులవుతారని సూచించారు. అనంతరం ఆర్కేవీబీపేట వద్ద మామిడిలో అంతర్ పంటగా సాగు చేస్తున్న మినుము, అలసంద పంటలను పరిశీలించారు. అలాగే అన్నూరు వద్ద వరి పంటను పరిశీలించి చీడపీడల నివారణకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజినల్ వ్యవసాయాధికారి మధుసూదన్‌రెడ్డి, మండల వ్యవసాయ ఆధికారి హేమలత, ఏఈఓలు గాయత్రి, హేమాద్రి పాల్గొన్నారు.







ముంచు కురిసే.. పాళెం మురిసే..

పొద్దు పొడిచే వేళ.. మంచుకురిసే సమయం కౌండిన్య శివారులోని బంగారుపాళెం అందానికి సరికొత్త శోభ సంతరించుకుంది. మొగలి ఘాట్ అందాలకు మంచు మునుగు మరింత సొగసు తోడై ప్రకృతి ప్రేమికుల మనస్సు దోచేసింది. చలిని సైతం లెక్క చేయకుండా పర్యావరణ ప్రేమికులు ఆ అందాలను చూసి పరవశించిపోయారు. బంగారుపాళెంలో బుధవారం ఉదయం పొగమంచు ఆవరించింది. ఈ దృశ్యం సందర్శకులను అలరించింది.

–బంగారుపాళెం

వైద్య శిబిరంలో 258 మందికి పరీక్షలు



వైద్యులతో మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె: భారతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో నారాయణ హృదయాలయ వారి సహకారంతో బుధవారం నిర్వహించిన గుండె వైద్య శిబిరంలో 258 మందికి పరీక్షలు నిర్వహించారు. 16 మందికి గుండె సంబంధిత వ్యాధులు ఉన్నట్లు గుర్తించారు. వారికి ఆరోగ్యశ్రీ పథకం కింద నారాయణ హార్ట్ సెంటర్‌లో ఉచిత శస్త్ర చికిత్స చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, అంబేద్కర్ సేన రాష్ట్ర కన్వీనర్ గణపతి, జిల్లా గౌరవాధ్యక్షుడు దొరస్వామి, కన్వీనర్ బాలచంద్ర పాల్గొన్నారు.